www.sphoortipatrika.com APTEL/26/A0542

# స్ఫూర్తి పత్రిక

Voice of Truth

విలేకరులు కావలెను
స్ఫూర్తి పత్రిక డైలీ పేపర్ నందు
కర్నూలు,నంద్యాల,అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్సార్ ,తిరుపతి, అన్నమయ్య ,చిత్తూరు ,జిల్లాలలో పనిచేసేందుకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నియోజకవర్గ ఇన్చార్జిలు మండల రిపోర్టర్స్ కావలెను.
స్ఫూర్తి పత్రిక Voice of Truth
గతంలో పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం వార్తలు చక్కగా రాయగలిగే నైపుణ్యం గల వారికి అవకాశం కలదు.
ఎటువంటి యాడ్స్ టార్గెట్లు లేదు. కొత్త వారికి అవకాశం కలదు.
ఆసక్తి గలవారు సంప్రదించండి : 8179446036,7794947413.

ప్రచురణ : కర్నూలు | సంపాదకుడు : నరసనాయుడు బోయ | సంపుటి : 01 సంచిక : 05 | పేజీలు : 04 వెల రూ. 2/- | గురువారం 05-03-2026

PUBLICATION : KURNOOL | EDITOR : NARASANAIDU BOYA | VOLUME : 01 ISSUE : 04 | PAGES : 04 PRICE : 2 | WEDNESDAY, 04 MARCH 2026

Kurnool Edition | Covering Andhra Pradesh & Telangana |

## గల్ఫ్ దేశాల్లో యుద్ధ పరిస్థితులు.. ఎవరూ ఆందోళన చెందవద్దు



- ఇరాన్.. గల్ఫ్ దేశాలపై చేస్తున్న దాడులతో యుద్ధ పరిస్థితులు నెలకొనగా.. ఆయాదేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రులెవరూ ఆందోళన చెందవద్దని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు.
- అసెంబ్లీ సమావేశాల్లో పశ్చిమాసియా పరిస్థితులు, గల్ఫ్ దేశాల్లో ఉన్న ఆంధ్రుల రక్షణపై ఆయన మాట్లాడారు. మిగతా 2లో

## మెడికల్ కాలేజీల్లో
# అదనంగా 11 సీట్లు

అవయవదానంలో దేశంలో ఏపీ ఆరో స్థానంలో నిలిచిందన్న మంత్రి సత్యకుమార్ యాదవ్

గత రెండు నెలల్లో 64 మందికి అవయవ మార్పిడి జరిగినట్లు వెల్లడి

రాష్ట్రవ్యాప్తంగా 5,000 మంది అవయవాల కోసం నిరీక్షిస్తున్నారన్న మంత్రి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మార్పిడి శస్త్రచికిత్సలు పెంచాలని ఆదేశాలు



గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలకు తేడా లేకుండా పోయిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీల్లో గత ప్రభుత్వం పెట్టిన విధానాలపై విమర్శలు చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో కూడా సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల విధానాలను తీసుకొచ్చారని ఆరోపించారు. 50 శాతం కన్వీనర్, 30 శాతం మేనేజ్మెంట్, మిగతా 2లో

## ఏపీపీఎస్సీ నియామకాల
# చట్టసవరణ బిల్లు

విశ్వవిద్యాలయాల్లో 3,371 అధ్యాపక పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయం

వచ్చే మూడు నెలల్లో యుద్ధప్రాతిపదికన నియామకాలు పూర్తి చేస్తామన్న మంత్రి లోకేశ్

గత నోటిఫికేషన్లలోని న్యాయపరమైన చిక్కుల కారణంగా ప్రక్రియ ఆలస్యం

కాంట్రాక్ట్ ఉద్యోగుల వెయిటేజ్‌పై న్యాయసలహా తీసుకుంటున్నామని వెల్లడి

ఫ్యాక్షన్ రాజకీయాలకు ఫుల్ స్టాప్.. బాధితుల కుటుంబాలకు ఉద్యోగ భరోసా: మంత్రి లోకేశ్

ఫ్యాక్షన్ బాధితుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించే బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన లోకేశ్

బీసీ నేత తోట చంద్రయ్య కుమారుడికి ఉద్యోగంతో ఈ చట్టం అమలుకు శ్రీకారం

ఫ్యాక్షన్ రాజకీయాలకు శాశ్వతంగా ముగింపు పలకడమే ని తమ లక్ష్యమన్న మంత్రి

గత ప్రభుత్వం ఈ బిల్లును కౌన్సిల్‌లో ఉద్దేశపూర్వకంగా అడ్డుకుందని విమర్శ

**ఫ్యాక్షన్ రాజకీయాలపై యుద్ధం**

**చంద్రయ్య త్యాగానికి గుర్తింపు**

**వర్సిటీల్లో 3,371 పోస్టుల భర్తీ.. 3 నెలల్లో పూర్తి చేస్తాం**

**వైఎస్ హయాంలో రాష్ట్రంలో మారణహోమం జరిగింది**

**త్వరలో కొత్త నోటిఫికేషన్ జారీ చేయనున్న కూటమి ప్రభుత్వం**



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 'ఏపీ పబ్లిక్ సర్వీసు నియామకాల బిల్లు' సవరణపై మంత్రి నారా లోకేష్ కీలక ప్రసంగం చేశారు. రాజకీయ హత్యలకు గురైన కుటుంబాలను ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ బిల్లు, గతంలో ఎదురైన అడ్డంకులను అధిగమించి మళ్లీ సభ ముందుకు వచ్చింది.ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. "2025 సెప్టెంబర్ 27న ఈ బిల్లును అసెంబ్లీ ఆమోదించి మండలికి పంపించాం. మిగతా 2లో

## టీటీడీ చైర్మన్ పదవికి బీఆర్ నాయుడు రాజీనామా చేయాలి



- ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో టీటీడీ చైర్మన్ పదవికి బీఆర్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలని వైసీపీ మాజీ మంత్రి ఆర్కె రోజాడిమాండ్ చేశారు
- టీటీడీ పదవికి నాయుడు అనర్హుడని ఆరోపించారు.
- ఆయన హయాంలో ఆవుల మరణాలు, తొక్కిసలాట ఘటనలు జరిగాయని అన్నారు
- దేశంలో ఏ ఆలయ చైర్మన్‌కు సంబంధించిన వీడియోలు ఇలా బయపటడిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. మిగతా 2లో

## కాంగ్రెస్ హయాంలో
# ఉపాధి అంటే ఒక హామీ

**అంగన్‌వాడీలపై కూటమి ప్రభుత్వానిది దౌర్జన్యకాండ.**

అర్ధరాత్రి అరెస్టులను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది.

డిమాండ్ల సాధనపై శాంతియుత నిరసన చేయడం తప్పేనా ?

హక్కులు అడిగితే సంకెళ్లు వేస్తారా ?

మహిళలని చూడకుండా ఇదెక్కడి అమానుషం ?




అర్ధరాత్రి అరెస్టులను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. డిమాండ్ల సాధనపై శాంతియుత నిరసన చేయడం తప్పేనా ? హక్కులు అడిగితే సంకెళ్లు వేస్తారా ? మిగతా 2లో

## బీసీలను పారిశ్రామిక వేత్తలుగా
# తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం

**పడవలు మరమ్మతులకు రూ.30 కోట్లు వెచ్చిస్తున్నాం**

2014-19లో వడ్డెర్లకు, రజకులకు, మత్స్యకారులతో ఇతక బీసీ కులాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం

గతంలో ఆదరణ, ఆదరణ 2.0 పథకాలను ప్రారంభించిన ఘనత సీఎం చంద్రబాబుదే

త్వరలో ప్రారంభించబోయే ఆదరణ 3.0లో వడ్డెర్లకు ప్రాధాన్యమిస్తున్నాం



2014-19లో వడ్డెర్లకు, రజకులకు, మత్స్యకారులతో ఇతక బీసీ కులాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం బీసీలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం గతంలో ఆదరణ, ఆదరణ 2.0 పథకాలను ప్రారంభించిన ఘనత మిగతా 2లో

## 20 పాఠశాలలపై బాంబుల వర్షం.. 170 మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల మృతి

ఇరాన్‌లోని 20 పాఠశాలలపై వైమానిక దాడులు

దీనిని యుద్ధ నేరంగా పేర్కొన్న ఇరాన్ ప్రభుత్వం

దాడులను తీవ్రంగా ఖండించిన ఐక్యరాజ్యసమితి

ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరిక



మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఇరాన్‌లోని పలు పాఠశాలలే లక్ష్యంగా జరిగిన మిగతా 2లో

## భారత్‌కు రష్యా భరోసా: గల్ఫ్ సంక్షోభం వేళ ఇంధన సాయానికి సిద్ధం

గల్ఫ్ సంక్షోభం వేళ భారత్‌కు ఇంధన సాయం చేస్తామన్న రష్యా

యుద్ధం ముదిరితే అదనపు చమురు సరఫరాకు మాస్కో హామీ

దేశంలో 50 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయన్న కేంద్రం

అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడిచమురు ధరలతో ఆందోళన

పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపిన పెట్రోలియం శాఖ



పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న వేళ, భారత్‌కు దాని మిత్రదేశం రష్యా అండగా నిలిచింది. యుద్ధ పరిస్థితుల కారణంగా గల్ఫ్ దేశాల నుంచి ముడిచమురు సరఫరాలో ఆటంకాలు ఏర్పడితే, భారత్‌కు అవసరమైన మిగతా 2లో

## 30 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు..
# నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్



- ఏపీ శాసనసభలో విపత్తు నిర్వహణ చట్టం సవరణ బిల్లును హోంమంత్రి వంగలపూడి అనిత ప్రవేశపెట్టారు.
- అగ్నిప్రమాద నివారణ చర్యలకు సంబంధించిన చట్టంలో మార్పులు చేయాలని నిర్ణయించామని తెలిపారు.

ఏపీ శాసనసభలో విపత్తు నిర్వహణ చట్టం సవరణ బిల్లును హోంమంత్రి వంగలపూడి అనిత ప్రవేశపెట్టారు. మిగతా 2లో

## ఇలా చేయడానికి మీకు
# సిగ్గనిపించడం లేదా?

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులకు కలియుగ ప్రత్యక్ష దైవం, వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న తిరుమల, తిరుపతి ఆలయాల నిర్వహణ, పరిపాలన అత్యంత పవిత్రతోపాటు నిష్ఠగా చేయాల్సిన బాధ్యత అని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు.

శాసనమండలిలో తిరుమల లడ్డూ అంశంపై చర్చ నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేవారు.

టీటీడీ ఛైర్మన్ పదవిలో నిష్కలంక వ్యక్తిత్వం, అచంచల భక్తి, నిబద్ధత, నిష్ఠ కలిగిన వారే ఉండాలని, కానీఈ పవిత్రమైన స్థానాన్ని సీఎం చంద్రబాబు నాయుడు స్వార్థ రాజకీయాలకు వేదికగా మార్చారని ఆయన విమర్శించారు.


ఆలయ ప్రతిష్ఠను మంటగలిపేలా వ్యవహరించారని, ఒక బాధిత మహిళ ఎన్నికలకు ముందే చంద్రబాబుకి లేఖ రాస్తూ ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ తనను మోసం చేశారని, తన జీవితంతో ఆడుకున్నాడని, ఏ చిన్న పనితో ఆడవారు వచ్చినా వారిని ఇబ్బంది పెడతారంటూ ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

**లడ్డూలో వాడే నెయ్యి విషయంలోనూ...**

**తప్పు చేసి, దాన్ని వేరొకరిమీదకు నెట్టి**

**భక్తి, నిబద్ధత, నిష్ఠ కలిగిన వారే ఉండాలి**

ఎన్నికల సమయంలో మీరు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు గట్టిగా అడగడం తప్పేలా అవుతుందని నిలదీశారు. రెండేళ్లు అవుతున్నా.. ఆ హామీలకు దిక్కూ, మొక్కూ లేదని నిలదీయడం నేరం అవుతుందా? అని ప్రశ్నించారు.



ఒక బాధ్యత ఉన్న వ్యక్తిగా చంద్రబాబు ఈ ఫిర్యాదుపై విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సింది పోయి, ఇన్నిరకాల ఆరోపణలు ఉన్నాయని తెలిసి కూడా, విచారణ, చర్యలన్నవి పూర్తిగా పక్కనపెట్టి, మిగతా 2లో

## సత్తెనపల్లిలో నాకున్న 22 ఎకరాల పొలాన్ని సర్వే చేయాలని నోటీసులు ఇచ్చారు



- తన ఆస్తులను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారన్న అంబటి
- చంద్రబాబు, లోకేశ్ కు వేరే పనేం లేదా అని ప్రశ్న
- గుంటూరులోని తన నివాసానికి కూడా నోటీసులు ఇచ్చినా ఆశ్చర్యపోనని వ్యాఖ్య
- నా ఆస్తులపై దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారు: అంబటి రాంబాబు

ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ కక్ష సాధింపు చర్యలు మితిమీరిపోయాయని, కూటమి ప్రభుత్వం తన ఆస్తులను లక్ష్యంగా చేసుకుని వేధిస్తోందని మాజీ మంత్రి, మిగతా 2లో

## కడప జిల్లా బలిజల సమస్యల పై కీలక సమావేశం..!!




కడప(స్ఫూర్తి పత్రిక) మార్చి 04 : వైయస్సార్ కడప జిల్లా. లోని ప్రముఖ నాయకులు, మరియు గ్రేటర్ రాయలసీమ బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు,చెన్నం శెట్టి మురళి ని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ను ఘనంగా శాలువా పూలమాలతో సత్కరించిన కడప జిల్లా బలిజ సంఘ ప్రధాన నాయకులు,బాలం. సుబ్బరాయుడు, వేంపల్లి. మండలం నాయకులు నక్కా సునీల్,అనంతరం వారు జిల్లా లో బలిజలు ఎదుర్కొంటున్న సమస్యలను మరియు వారి అభ్యున్నతి పై పలు కీలకమైన విషయాలనుచర్చించినట్లు వారు తెలిపారు.జిల్లాలో బలిజల ను మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు బాధ్యతగా కృషి చేస్తానని గ్రేటర్ రాయలసీమ బలిజ సంఘం నాయకులు చెన్నం శెట్టి మురళి,భరోసా కల్పించారని బలిజ సంఘం ప్రధాన నాయకులు బాలం సుబ్బరాయుడు, నక్కా సునీల్.తెలిపారు..

## టమోటా రైతులను తక్షణమే ఆదుకోవాలి..!!




కడప (స్ఫూర్తి పత్రిక) మార్చి 04 : పేదల ముఖాల్లో చిరునవ్వు కోసం చివరి శ్వాస వరకు ప్రజా సేవ చేసిన నాయకుడు దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి, ఆ మహనీయుని అడుగు జాడలలో నడిచిన ఆయన తనయుడు, వైయస్ జగన్ అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ఐటీ వింగ్ జాయింట్ సెక్రెటరీ, పాలకొలను. లక్ష్మీనారాయణ రెడ్డి, వైయస్సార్ కడప జిల్లా, వైసిపి. జనరల్ సెక్రెటరీ, పీవీ. రాఘవరెడ్డి, ఖాజీపేట, మండల అధ్యక్షుడు దుగ్గిరెడ్డి మురళీమోహన్ రెడ్డి, అన్నారు. అబద్దాలతో ప్రజలను మోసం చేసి పట్టాన్ని చేత పట్టుకుని రైతులను ప్రజలను మరోసారి మోసం చేశారని రాష్ట్రంలో దళారీల తో కుమ్మక్కై టమోటా.రైతాంగాన్ని ముంచేస్తున్న రాష్ట్ర కూటమి ప్రభుత్వం కూరగాయల ధరలు పతనం అవుతున్న వ్యవసాయం దండగ అనే తన మాటను నేడు నిజం చేసేందుకు రైతుల కష్టాలను సమస్యలను పట్టించుకోలేదని కూరగాయల పంట రైతులను తక్షణమే కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు...

## ఇరాన్ పై అమెరికా,ఇజ్రాయిల్ దాడులు తక్షణమే నిలిపివేయాలి..!!

**పీడీఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న**



రాయచోటి,(స్ఫూర్తి పత్రిక)మార్చి 04 : ఇరాన్ పై అమెరికా మరియు ఇజ్రాయిల్ సంయుక్తంగా కొనసాగిస్తున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని పీడీఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న పేర్కొన్నారు.రాయచోటి పట్టణంలో ఎన్జీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ .ప్రపంచ దేశాల పై తమ ఆధిపత్యాన్ని కొన సాగించడాని కి అమెరికా సామ్రాజ్యవాద శక్తులు నిరంతరంయుద్ధాలను ప్రోత్సహిస్తున్నాయని ఆయన విమర్శించారు.ఇరాన్ పై జరుగుతున్న దాడులు అంతర్జాతీయ శాంతి భద్రతలకు తీవ్రమైన ముప్పుగా మారాయని ఆయన అన్నారు.ఒక దేశం సార్వ భౌమాధికారాన్ని ఉల్లంఘిస్తూ దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ దాడుల కారణంగా పశ్చిమ ఆసియా ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు మరింత పెరిగి ప్రపంచ శాంతి ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. యుద్ధ పరిస్థితుల వల్ల చమురు ధరలు పెరిగి, ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రం కావచ్చని తెలిపారు.అమెరికా మరియు ఇజ్రాయిల్ తక్షణమే ఇరాన్ పై చేస్తున్న దాడులను నిలిపివేయాలని, ప్రపంచ దేశాలు ఈ దాడులను ఖండిస్తూ శాంతి పరిరక్షణకు కృషి చేయాలని పీడీఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న డిమాండ్ చేశారు. అలాగే భారత ప్రభుత్వం కూడా ఈ దాడుల పై స్పష్టమైన వైఖరి ప్రకటించి శాంతి స్థాపనకు కృషి చేయాలని ఆయన కోరారు.

## పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష సామాగ్రిని అందజేసిన ఖాజీపేట, సీఐ...!!



ఖాజీపేట,(స్ఫూర్తి పత్రిక)మార్చి 04 : ఖాజీపేట,మండలం కే.సుంకేసుల గ్రామ పరిధిలోని కస్తూరిబా గాంధీ, గర్ల్స్ హై స్కూల్ లో 10వ తరగతి చదువుతున్న బాలికలకు ఖాజీపేట, మండల అధికారి సీఐ వంశీధర్ చేతుల మీదగా విద్యార్థులకు పదవ తరగతి పరీక్ష సామాగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా సిఐ. వంశీధర్, మాట్లాడుతూ. విద్యార్థినిలు కష్టపడి చదువుకొని పదవ తరగతి పరీక్ష ల లో మంచి మార్కులు సాధించాలని కస్తూరిబా గాంధీ గర్ల్స్ హైస్కూల్ కు మంచి మంచి పేరు తీసుకురావాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అలాగే జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని విద్యార్థిని లకు ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు కస్తూరి బా గాంధీ గర్ల్స్ హై స్కూల్ ఉపాధ్యాయులు వారి సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు...

## విద్యార్థినిలకు స్వీయ రక్షణ అవగాహన



(స్ఫూర్తి పత్రిక)మార్చి 04 : ప్రతినిధి కోసిగి: కోసిగి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో కోసిగి ఎస్సై రమేష్ రెడ్డి మరియు వారి సిబ్బంది విద్యార్థిని మరియు బాలికలకు స్వయం రక్షణ శిక్షణ శిబిరం నిర్వహించ బడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలకు వ్యక్తిగత, భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి. అనుమానాస్పద వ్యక్తులను ఎలా గుర్తించాలి. ప్రమాద సమయంలో ఎలా సహాయం పొందాలి అనే అంశాలపై వివరంగా కోసిగి ఎస్సై రమేష్ రెడ్డి సూచనలు ఇచ్చారు. అలాగే ప్రాథమిక స్వయం రక్షణ పద్ధతులపై ప్రాయోగిక శిక్షణ అందించబడింది. ముఖ్యంగా బాలికలు ధైర్యంగా ఉండి, తమను తాము రక్షించుకునే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ప్రోత్సహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థినిలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## చదువులమ్మ బిడ్డల ఆశయాలను గెలిపించడానికి చేయూతనిద్దాం.

**పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేసిన- ఏఐఎస్ఎఫ్.**




(స్ఫూర్తి పత్రిక)మార్చి 04 : ప్రతినిధి కోసిగి: బుధవారం కోసిగి మండల కేంద్రంలో స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి అంజి అధ్యక్షతన పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.రాజు, జిల్లా ఉపాధ్యక్షులు యస్.ఈరేష్, పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ ఉమాదేవి పాల్గొన్నారు .వారు మాట్లాడుతూ పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో కీలకమైన మలుపు అని, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా, ధైర్యంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థినిలు అందరూ క్రమశిక్షణతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, మండలంలోనే కస్తూర్బా గాంధీ పాఠశాలకు మంచిపేరు తీసుకొస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. పదవ తరగతి చదువుతున్న 50 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ మరియు పెన్నులను విద్యార్థి సంఘం నాయకత్వం మరియు ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు చేతుల మీదుగా విద్యార్థినీయులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఇంద్రజ,దేవి,కళ్యాణి, శ్రీదేవి, సుజాతమ్మ, యశోద, జానకి,శ్యామల,రావలి,ప్రవీణ,మరియు ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రకాష్,జీవన్,వీరేష్,రాజు,సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే పనులను మరింత చురుగ్గా చేపట్టాలి..!!

### వైయస్సార్ కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి..




కడప,(స్ఫూర్తి పత్రిక) మార్చి 04 : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూ రికార్డుల స్వచ్ఛీకరణ, రీ సర్వే పనులను.. జిల్లాలో ప్రణాళిక ప్రకారం చురుగ్గా చేపట్టాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.రాష్ట్ర రాజధాని నుండి రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్,రాష్ట్ర భూ పరిపాలనా శాఖ (సీసీఎల్ఏ) ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మితో కలిసి.భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా రెవెన్యూ క్లినిక్స్, పిజిఆర్ఎస్, మ్యుటేషన్స్ (ఉత్పరివర్తనలు), రీసర్వే, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీ లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు.ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరితో పాటు.జేసీ డా. నిధి మీనా హాజరయ్యారు.జిల్లాలోని అన్ని మండలాల రెవెన్యూ అధికారులతో విసి ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శి వారి సూచనల మేరకు..జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న రీసర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.మ్యుటేషన్ లో భాగంగా సేల్, సబ్ డివిజన్, జాయింట్ ఎల్పిఎం తదితర వ్యక్తిగత వివరాలలో ఎటువంటి తప్పిదాలు లేకుండా పూర్తి చేసి పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. రీసర్వేకార్యక్రమంలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి ఆటంకాలు రాకుండాచర్యలు తీసుకోవాలన్నారు వివాదాలు లేని భూ రికార్డుల రూపకల్పన కోసమే ఈ రీసర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. అలాగే.. భూ సమస్యలపై పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్స్ ద్వారా అందే అర్జీల పట్ల.. సదరు అర్జీ ప్రాథమిక పరిశీలన దశలో ఉన్నట్టు సమాచారం అర్జీదారులకు అందించడం బాధ్యతగా చేపట్టాలన్నారు.ఈ విసి కార్యక్రమంలో కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి ల్యాండ్ సర్వేశాఖఈడి, శాంతరాజు. సంబందిత సెక్షన్,సూపరింటెండెంట్లు, రెవెన్యూ అధికారులు సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు...

## జనసేన పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ దూదేకుల ఖాసీం సైదా ఆధ్వర్యంలో ఘనంగా సభ్యత నమోదు కేంద్రం ప్రారంభం





పిడుగురాళ్ల మార్చి 4 (స్ఫూర్తి పత్రిక): జనసేన పార్టీ ఉద్యమి సభ్యత నమోదు కార్యక్రమంలో భాగంగా పిడుగురాళ్ల పట్టణం లోని బిస్మిల్లా స్టిక్కరింగ్ పాయింట్ నందు సభ్యత్వ నమోదు కేంద్రం ను గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు చేతుల మీద గా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని గురజాల నియోజకవర్గం లో అత్యధిక సభ్యత్వాలు చేసే విధంగా కార్యకర్తలు అందరు కృషి చేయాలని, నీతి నిజాయితీగా అవినీతికి తావు లేకుండా,కార్యకర్తల సంక్షేమాన్ని కోరుకునే జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి భరోసాగా ప్రతి ఒక్కరూ సభ్యత్వం నమోదు చేసుకోవాలని అన్నారు, ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి భరోసాగా ఐదు లక్షల రూపాయలు ప్రమాద బీమా వర్తిస్తుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల మండల అధ్యక్షులు కామిశెట్టి రమేష్ , జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు దూదేకుల సలీం, మందా జెస్సి, అబ్దుల్ గఫూర్, దూదేకుల ఖాసీం, మండల ఉపాధ్యక్షులు బయ్యవరపు రమేష్, బేతంచర్ల ప్రసాద్, గుర్రం కోటేశ్వరావు, నకరికంటి నరసింహారావు,పెదకొలిమి కిరణ్,సింగంశెట్టి వెంకట రమణ,షేక్ గఫూర్,సిద్దెల సురేష్, నల్లమోతు సుబ్బారావు, గజ్జి సీతారామయ్య,షేక్ నాగుల్ మీరా, దూదేకుల బాషా, గుంటూరు శ్రీను, షేక్ సైదా, తిప్పనబోయిన సూరి, షేక్ ఖాసీం,పవన్,పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు

## కావలి పట్టణంలో జనసేన పార్టీ రెండవ రోజు ఉద్యమి సభ్యత్వ నమోదు శిబిరం



కావలి:(స్ఫూర్తి పత్రిక) మార్చి 4:కావలి పట్టణంలోని బిడ్జి సెంటర్ మరియు ఎమ్మార్వో కార్యాలయం ఎదురు గా రెండవరోజు బుధవారం కూడా కొనసాగుతున్న ఉద్యమి నమోదు కార్యక్రమము కావలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ అళహరి సుధాకర్ సూచనలతో వీరమహిళలు కందుల లక్ష్మీ కవిత, అఖిలగుంట సాహితీ హెలెన్ లిఖిత మరియు నాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి జనసేన సభ్యత్వ నమోదు చేశారు.ఈ కార్యక్రమానికి మురళీ కృష్ణ మస్తాన్ తదితరులు పాల్గొని జనసేన సభ్యత్వ నమోదు చేయించారు.జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కల్పిస్తున్న ఉద్యమి సభ్యత్వ ప్రమాద బీమా ప్రయోజనాలు ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే 5 లక్షల రూపాయలు బీమా వర్తిస్తుందని ప్రమాదవశాత్తు రెండు కళ్ళు రెండు చేతులు రెండు కాళ్లు కోల్పోయినా లేదా ఒక కన్ను ఒక చేయి ఒక కాలు కోల్పోయినా 5 లక్షల రూపాయలు బీమా వర్తిస్తుందని ప్రమాదవశాత్తు ఒక కన్ను లేదా ఒక చేయి లేదా ఒక కాలు కోల్పోతే 2.5 లక్షల రూపాయల వరకు బీమా వర్తిస్తుందని ప్రమాదవశాత్తు పూర్తిగా వైకల్యం కలిగిన పక్షంలో 5 లక్షల రూపాయల వరకు బీమా అందించబడుతుందని తెలిపారు.కావున నాయకులు, వీరమహిళలు,జనసైనికులు మరియు అభిమానులు తప్పక సభ్యత్వ నమోదు చేసుకొని పవన్ కళ్యాణ్ భరోసా పొందాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## అమరావతి ఆత్మీయ సమావేశం నారా లోకేశ్ ఆహ్వానంతో కుటుంబ సమేతంగా పాల్గొన్న కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి




కావలి:(స్ఫూర్తి పత్రిక) మార్చి 4:అమరావతి ఉండవల్లి నివాసంలో యువనాయకులు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆహ్వానం మేరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రజా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి కుటుంబ సమేతంగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ అందించిన ఆత్మీయ స్వాగతం, చూపించిన ప్రేమాభిమానాలు తమను ఎంతో హత్తుకున్నాయని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలిపారు.బిజీ షెడ్యూల్‌లో కూడా సమయం కేటాయించి అందరితో ఆప్యాయంగా ముచ్చటించడం ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు.ఉమ్మడి నెల్లూరు జిల్లా అభివృద్ధి ప్రజాసంక్షేమ అంశాలపై స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు జరిగాయి.మంత్రి నారా లోకేశ్ కి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎ.జి.పి గా వేణుమాధవ్ నియామకం పై హర్షం వ్యక్తం చేసిన యం మాలకొండారెడ్డి




కావలి;(స్ఫూర్తి పత్రిక) మార్చి 4:అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా కావలి కోర్టులో సీనియర్ న్యాయవాది బెల్లంకొండ వేణుమాధవ్ ను ప్రభుత్వం నియమించడంపై కావలి లోక్ అథాలత్ సభ్యులు యం. మాలకొండారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఏజీపీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వేణుమాధవ్ చాంబర్ కు వెళ్లి ఆయనను ఘనంగా సత్కరించారు.మాలకొండారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ వేణుమాధవ్ గత 25 సంవత్సరాల నుండి కావలి కోర్టులో విశిష్ట మైన న్యాయ సేవలు అందిస్తున్నారని న్యాయ వ్యవస్థ కి వన్నె తీసుకురావాలని బుధవారం వారికి అభినందనలు తెలిపారు.గతంలో వేణుమాధవన్ ను కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ గవర్నమెంట్ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ గా నియమించిన సంగతి అఃదరికీ విదితమే అని అన్నారు.

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కన్నుల పండగగా స్వామివారి రథోత్సవం...




కావలి:(స్ఫూర్తి పత్రిక) మార్చి 4:కావలి నియోజక వర్గంలోని అతిపెద్ద పుణ్యక్షేత్రమైన బోగోలు మండలంలో ఉన్న కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది ఎప్పుడూ లేనంత వైభవంగా జరుగుతున్నాయి.కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి,ఆలయ అధికారులు కమిటీ సభ్యులు, పర్యవేక్షణలో నిర్వహణ ఏర్పాట్లు మరింత విశిష్టంగా కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన స్వామివారి రథోత్సవం కన్నుల పండుగగా జరిగింది.అద్భుతంగా అలంకరించిన రథంపై స్వామివారు గ్రామ పురవీధుల్లో విహరించగా భక్తులు భారీగా తరలివచ్చి గోవింద నామస్మరణలతో స్వాగతం పలికారు.రథం సాగిన ప్రతి వీధి భక్తి శ్రద్ధలతో మారుమోగింది.మహిళలు హారతులు పట్టి స్వామివారిని ఆహ్వానించగా యువత కోలాటాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది.భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.బ్రహ్మోత్సవాలు మరింత ఘనంగా కొనసాగుతున్నాయి.

### ముచ్చటగా మూడోసారి గ్రామకంఠం

# భూములపై సర్వేయర్ వివాదం

### సర్వే చేయకుండానే సంతకాలు - గార్లదిన్నెలో గ్రామ కంఠం భూములపై వివాదం




గ్రామ కంఠం భూములపై సర్వే పూర్తి చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు

డోన్ (స్ఫూర్తి పత్రిక)మార్చి 4: నంద్యాల జిల్లా,డోన్ నియోజకవర్గం పరిధిలోని ప్యాపిలి మండలంలోని గార్లదిన్నె గ్రామంలో గ్రామ కంఠం భూముల సర్వే వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసి సర్వే నిర్వహిస్తామని చెప్పిన అధికారులు, మూడోసారి కూడా సర్వే చేయకుండానే వెళ్లిపోవడం గ్రామస్తుల్లో ఆగ్రహాన్ని రగిలించింది.

**సర్వేకు వచ్చి హడావుడిగా వెనుదిరుగు**

ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేసి సర్వే కోసం గ్రామానికి చేరుకున్న సర్వేయర్, కొద్ది సేపటికే "అత్యవసర మీటింగ్ ఉంది" అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు గ్రామస్తులు తెలిపారు. ప్రాంగణంలో ఎటువంటి కొలతలు చేపట్టకుండానే వెనుదిరిగారని వారు ఆరోపిస్తున్నారు.

**సర్వే పూర్తయినట్టు సంతకాలు**

సర్వే నిర్వహించినట్టు చూపిస్తూ కొందరి నుంచి సంతకాలు తీసుకున్నారని, కానీ వాస్తవానికి ఎలాంటి సర్వే జరగలేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో తప్పుడు నివేదికలు సమర్పిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.




సర్వేయర్

**రెవెన్యూ అధికారిపై ఆరోపణలు**

గ్రామంలో ఓ రెవెన్యూ అధికారి మల్లారెడ్డి సర్వే ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారని, కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు సర్వే చేయమని ఆదేశాలు ఇచ్చినా, కేవలం నోటీసులతో సరిపెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆగ్రహంలో రైతులు**

గ్రామ కంఠం భూములపై స్పష్టత రావాలంటే పూర్తి స్థాయి సర్వే నిర్వహించాలని, ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇకపై సర్వే పేరుతో కాలయాపన చేస్తే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

# అక్షరాంధ్ర ద్వారా అక్షరాస్యులు కండి

**మార్చి 15 వ తేదీన నిర్వహించబోయే 'అక్షరాంధ్ర' ఫైనల్ పరీక్షకు పరీక్షా కేంద్రాలను త్వరితగతిన గుర్తించండి**

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**





కర్నూలు ప్రతినిధి మార్చి 04 (స్ఫూర్తి పత్రిక న్యూస్) అక్షరాంధ్ర ద్వారా అక్షరాస్యులు కావాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పిలుపునిచ్చారు. బుధవారం వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అక్షరాంధ్ర' కార్యక్రమంలో భాగంగా కృష్ణగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అక్షరాభ్యాస శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బుధవారం నిర్వహించిన అక్షరాంధ్ర ప్రీ ఫైనల్ పరీక్షల్లో అభ్యాసకులు ఏ విధంగా రాశారని అడిగి తెలుసుకున్నారు. సాధన పుస్తకము ద్వారా అభ్యాసకులు రాసిన సమాధానాలను తెలుసుకుని, పరీక్షలు చాలా బాగా రాసారని కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రీ ఫైనల్ పరీక్షల్లో వచ్చిన ఫలితాలను అన్నిటిని రేపు సాయంత్రానికి సమర్పించాలని కలెక్టర్ ఫోన్ ద్వారా డిడి అడల్ట్ ఎడ్యుకేషన్ ను ఆదేశించారు. మార్చి 15వ తేదీన నిర్వహించే ఫైనల్ పరీక్ష కూడా బాగా రాయాలని కలెక్టర్ అభ్యాసకులను కోరారు. 'అక్షరాంధ్ర' కార్యక్రమంలో రిజిస్టర్ అయిన అభ్యాసకులు అందరూ తప్పకుండా మార్చి 15వ తేదీ పరీక్షకు హాజరయ్యేలా చూడాలన్నారు. మార్చి 15 వ తేదీన నిర్వహించబోయే ఫైనల్ 'అక్షరాంధ్ర' పరీక్షకు ప్రతి గ్రామంలోని కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం లేదా పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా త్వరితగతిన గుర్తించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలోని కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం లేదా పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా గుర్తించి, ఇన్విజిలేటర్లుగా పాఠశాల ఉపాధ్యాయులను లేదా అంగన్‌వాడీ టీచర్లను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా.భాస్కర్ రాజు, పత్తికొండ ఇంచార్జి ఆర్డీఓ కొండయ్య, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి



**వీఆర్ఎఏలకు పేస్కేలు, జీతాలు అమలు చేయాలి**

**అర్హులకు వీఆర్వో గా**

**వన్ టైం సెటిల్మెంట్ ద్వారా ప్రమోషన్ ఇవ్వాలి**

**నామినీలుగా పనిచేస్తున్న**

**వారిని వీఆర్ ఏలుగా నియమించాలి**

**తహసిల్దార్ కు వినతి ద**

**పత్రం అందజేసిన వీఆర్ఏలు**

పెద్దకడబూరు మార్చి 4 (స్ఫూర్తి పత్రిక న్యూస్) ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ వ్యవస్థలో సుమారు 19,359 వేలమంది గ్రామ రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్నారు. రెవిన్యూ శాఖలో సుదీర్ఘకాలం నుండి చాలా తక్కువ వేతనంతో పని చేస్తున్నాము. రెవెన్యూ డిపార్ట్మెంట్లో దిగువ స్థాయిలో పనిచేస్తూ, ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి ఉన్నారు. డిపార్ట్మెంట్ ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. గ్రామంలో నివసిస్తూ, అనునిత్యం ప్రజా సమస్యలు పరిష్కరించడంలో మరియు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులు పార్ట్ టైం ఉద్యోగులు అయినా రాత్రి పగలు తేడా లేకుండా పనిచేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం వీఆర్ఎలకు తీవ్ర అన్యాయం చేసింది. గత వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదు. వేతనం పెంచకపోగా డిఏ ని కూడా ఉపసంహరించి రికవరీ చేశారు. 2018లో నాడు గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు రూ 6,500 నుండి 10,500 లకు వేతనం పెంచారు. డిఎ రూ 300 రూపాయలు ఇచ్చారు. గత ప్రభుత్వం డిఏ ని కూడా ఉపసంహరించి రికవరీ చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చాక అయినా జీతాలు పెరుగుతాయని, ప్రమోషన్లు అమలు చేస్తారని వీఆర్ఎలు ఆశించారు. కానీ గత 19 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం వీఆర్ఎల సమస్య ఏ ఒక్కటి పరిష్కరించలేదు. నిబంధనలకు విరుద్ధమైన డ్యూటీలు వేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నైట్ వాచ్మెన్ డ్యూటీలు, అటెండర్ డ్యూటీలు వేశారు. ఇదే గాక రీ సర్వే పేరుతో మైళ్ళకొద్దీ ఇతర ప్రాంతాలకు వెళ్లి పని చేయాల్సి వస్తుంది. అదనపు పని భారం పెంచినందుకు అవసరమైన టి ఏ, డిఏ ల గురించి పట్టించుకోలేదు. అదనపు పని భారానికి ఆర్థిక సమస్యలు కూడా తోడవడంతో వీఆర్ఎల కుటుంబాలు పస్తులతో గడపాల్సిన స్థితికి నెట్టబడ్డాయి. గ్రామ రెవెన్యూ సహాయకులకు గత 8 సంవత్సరాల నుండి జీతాలు పెరగలేదు. మన జీతం బెత్తెడు, ధరలేమో ఆకాశాన్నంటుతున్నాయి. మన పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రంలో వీఆర్ఎలకు మూడేళ్లుగా ఆ రాష్ట్ర ప్రభుత్వం పే స్కేలు ఇచ్చి ఆదుకుంటుంది. మన రాష్ట్రంలో కూడా పే స్కేలు జీతాలు ఇవ్వాలని మంత్రులు అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్న కనికరించడం లేదు. చదువుకున్న వీఆర్ఎలు ఎప్పటికైనా వీఆర్వో ప్రమోషన్ వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వ మాత్రం ప్రమోషన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తుంది. ప్రమోషన్ల కొరకు ఎదురు చూస్తున్న వీఆర్ఎలకు వయోభారం పెరుగుతుంది. దళిత, గిరిజన మైనార్టీ, బడుగు బలహీన వర్గాలకు చెందిన వీఆర్ఎల కుటుంబాలను ఆకలి బాధల నుండి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. అక్రమ డ్యూటీలను రద్దు చేసి, వాచ్మెన్లు, అటెండర్లు ఎక్కడైతే అవసరమో అక్కడ సీనియారిటీ ఉన్న విఆర్ఎలను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరుతున్నాము. చేస్తున్నాము. గనుక గ్రామ రెవెన్యూ సహాయకుల పట్ల సానుభూతితో వ్యవహరించి మా సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి

**సమస్యలు**

1) గ్రామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే పే స్కేలు, జీతాలు అమలు చేయాలి.

2) అర్హత ఉన్న వీఆర్ఎలకు వన్ టైం సెటిల్మెంట్ ద్వారా వీఆర్వో గా ప్రమోషన్లు ఇవ్వాలి.

3) ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఎలుగా నియమించాలి.

4) వీఆర్వో, అటెండర్ మరియు నైట్ వాచ్మెన్ ప్రమోషన్ కోటాను 20 శాతం నుండి 70 శాతం నికి పెంచాలి. గనుక వీఆర్ఏల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.

**(షేక్ బందగీసాహెబ్)అధ్యక్షులు**

(కె.ఉమామహేశ్వరరావు) రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం నాయకులు నరసింహులు, నాగరాజు, భీమన్న, ఉసేని పాల్గొన్నారు.

# యువతలో ఊబకాయం దేశానికి నష్టదాయకం







**వైస్ ప్రిన్సిపల్ ఢ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి**

**డాక్టర్ సింధియా శుభప్రద**

కర్నూలు ప్రతినిధి మార్చి 04 (స్ఫూర్తి పత్రిక న్యూస్)ఏ దేశానికైనా యువత ఉత్పాదక శక్తి అని అలాంటి యువత ఉబకాయం బారిన పడటం దేశానికి నష్టదాయకమని కర్నూల్ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ ఢ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సింధియా శుభప్రద అన్నారు. బుధవారం దిన్నేదేవరపాడు గ్రామంలో మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో "ప్రపంచ ఉభకాయ దినోత్సవం మార్చి 4" పురస్కరించుకొని "ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ మరియు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సోషల్ అండ్ ప్రైవేటు మెడిసిన్ ఏపీ చాప్టర్" ఇచ్చిన పిలుపుమేరకు గ్రామంలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు శారీరక దృఢత్వం కలిగి ఉండాలని జంక్ ఫుడ్స్ కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. యువతకు తమ శరీరం గురించి, తీసుకోవాల్సిన ఆహార పప్రదార్థాల గురించి వాటి లాభనష్టాల గురించి అవగాహన వస్తే వారు వారి కుటుంబంలో సభ్యులకు కూడా అవగాహన కలిగిస్తారని తద్వారా కుటుంబం, సమాజం, దేశం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్ గా వ్యవహరించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పుష్పలత పీజీ డాక్టర్లను రెండు గ్రూపులుగా చేసి ఒక టీం తో గ్రామంలోని పెద్దలకు బాడీ మాస్ ఇండెక్స్ కొలతలు తీసి వారికి అవగాహన కలిగించగా, మరొక బృందం గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు యువతలో వచ్చే ఉబకాయం జంక్ ఫుడ్స్ తీసుకోవాల్సిన ఆహార ప్రాంతాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దిన్నదేవరపాడు గ్రామ సర్పంచ్ మాధవస్వామి, జిల్లా పరిషత్ హై స్కూల్ ఇన్చార్జ్ హెడ్మాస్టర్ యాసీన్, అసోసియేట్ ప్రొఫెసర్ డా.అరుణ, అసిస్టెంట్ డా. వెంకటేశ్వర్లు టీచర్ హేమచంద్ర రెడ్డి, పీజీ డాక్టర్లు డా.కార్తీక్, డా. సబిహ, డా. నుస్రత్ డా.సౌమ్య డా.సభా, డా.పూజ హెల్త్ ఎడ్యుకేటర్ షణ్ముఖుడు, హెల్త్ సూపర్వైజర్లు సాయిరాం, మాధవరాజు, హెల్త్ అసిస్టెంట్లు నాగేశ్వ రమ్మ, సుభాషిని, శ్రీదేవి, ఆశా కార్యకర్తలు పద్మ, సుజాత, మాధవి , సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అ పాల్గొన్నారు.

# ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం





కర్నూలు ప్రతినిధి మార్చి 04 (స్ఫూర్తి పత్రిక న్యూస్) ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా కర్నూలులోని జిల్లా సత్వర చికిత్స కేంద్రం (డిఇఐసి), ఓపీ నెం.43 మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గిరిజన బాలికల రెసిడెన్షియల్ హై స్కూల్ లలో వినికిడి లోపం ఉన్న పిల్లలు మరియు వారి తల్లిదండ్రుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం మరియు అసంక్రమిత వ్యాధుల కార్యనిర్వహణ అధికారి డాక్టర్ ఎన్. మహేశ్వర ప్రసాద్ బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించిన శబ్దాలు, ధ్వనులు వినడం వల్ల వినికిడి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. మన నిత్యజీవన విధానంలో వినికిడి జ్ఞానం ద్వారా మనం మాట్లాడటం, నేర్చుకోవడం, వినడం, ఆలోచనలు ఇతరులతో పంచుకోవడం, ప్రమాదాలను ముందుగానే గుర్తించడం వంటి అనేక విషయాలు సాధ్యమవుతాయని అన్నారు. అందువల్ల మన జ్ఞానేంద్రియాల్లో ముఖ్యమైన చెవి ఆరోగ్యం మరియు దాని పనితీరును కాపాడుకోవడం ఎంతో అవసరమని సూచించారు. నేటి సమాజంలో పరిమితికి మించిన శబ్దాలకు ప్రజలు అలవాటు పడుతున్నారని, హెడ్‌సెట్స్, ఇయర్ బడ్స్, డీజే సౌండ్స్ మరియు శృతి మించిన ధ్వనుల కారణంగా వినికిడి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. శబ్ద స్థాయి 80 డెసిబెల్స్ ను మించకుండా ఉండటం చెవికి సురక్షితమని చెప్పారు. తరచూ "మరోసారి చెప్పండి" అని అడగడం, గొంతు పెంచి మాట్లాడడం, ఫోన్ వాడిన తర్వాత చెవిలో మోగుతున్నట్లు అనిపించడం, టీవీ లేదా మొబైల్ వాల్యూమ్‌ను ఎక్కువగా పెంచడం వంటి లక్షణాలు వినికిడి సమస్యలకు సంకేతాలని పేర్కొన్నారు. అసంక్రమిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమాల్లో భాగమైన ప్రపంచ వినికిడి దినోత్సవం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించి, శబ్ద కాలుష్య నియంత్రణలో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా పిల్లల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని, వినికిడి లోపం వల్ల నేర్చుకోవడం మరియు మాట్లాడే సామర్థ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సత్వర చికిత్సకేంద్రం శిశువైద్యురాలు డాక్టర్ సృజన మాట్లాడుతూ ప్రపంచ వినికిడి దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. వినికిడి లోపానికి కారణాలు, నివారణ చర్యలు, ఆడియాలజిస్ట్ పాత్ర, వినికిడి లోపాన్ని తొలిదశలో గుర్తించి సమయానికి చికిత్స పొందడం ఎంత ముఖ్యమో వివరించారు. అదేవిధంగా వినికిడి లోపం ఉన్న పిల్లలకు కోక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అలాగే వినికిడి లోపం ఉన్న పిల్లల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు భారత ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాల గురించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ జి. సుధాకర్, ఆర్‌కెఎస్‌కె కన్సల్టెంట్ డాక్టర్ మల్లికార్జున, జిల్లా సత్వర చికిత్స కేంద్రం మేనేజర్ ఇర్ఫాన్ షేక్, ఆడియాలజిస్ట్ రాజేశ్వరి మరియు జిల్లా సత్వర చికిత్స కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# విధుల్లో అలసత్వం తగదు

**నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

**విధినిర్వహణలో క్రమశిక్షణ, బాధ్యత మరవద్దు**



కర్నూలు ప్రతినిధి మార్చి 04 (స్ఫూర్తి పత్రిక న్యూస్) ఉద్యోగులు విధుల్లో అలసత్వం ప్రదర్శించడం అస్సలు సహించబోమని, విధినిర్వహణలో క్రమశిక్షణ, బాధ్యతను విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన రామలింగేశ్వర్ నగర్ 115వ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమతి లేకుండా అడ్మిన్ సెలవు పెట్టడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. సచివాలయంలో హాజరు రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్, టీకాల నమోదు పత్రాలు, పింఛన్ల పంపిణీ రికార్డులను పరిశీలించారు. విధుల నిమిత్తం కార్యాలయం బయటకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి, సంబంధిత వాట్సాప్ గ్రూపులో లొకేషన్‌తో పాటు ఫోటోలు అప్లోడ్ చేయాలని సూచించారు. విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పింఛన్ల పంపిణీ పూర్తయ్యిన వెంటనే మిగిలిన నగదును ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలని, వ్యక్తిగత ఖాతాల ద్వారా ఎలాంటి లావాదేవీలు చేయరాదని ఆదేశించారు. సచివాలయంలో పియూపి పనులు పూర్తి చేయించుకోవాలని, శాశ్వత భవనంలో బాత్రూంలు సహా అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని, ప్రతి సేవను నిర్దిష్ట గడువులోగా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి పరిష్కరించాలని, కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అమినిటీస్ కార్యదర్శి బి. ఉదయ్ కుమార్, డబ్లూపిఓ కె.సుబ్రద, ఎఎన్ఎం షాహా, తదితరులు పాల్గొన్నారు.

# వృధాగా పడి ఉన్న చేతి పంపుకు మరమ్మతులు చేపట్టండి


**కాలనీవాసులు ఆవేదన వ్యక్తం**



పెద్దకడబూరు మార్చి 4 (స్ఫూర్తి పత్రిక న్యూస్) మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామంలో స్థానిక మఠం సమీపంలో పెద్దబావి దగ్గర చేతిపంపు గత నెలలుగా చెడిపోయి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఎండాకాలం సమీపిస్తున్న తరుణంలో నీటి కొరత మొదలవుతుందని, చేతిపంపు ద్వారా వచ్చే నీటిపై ఆధారపడిన తమకు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

# నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు చేయండి

**టిడిపి ఇంచార్జ్ ని కోరిన కప్పట్రాళ్ల గ్రామ రైతులు**



దేవనకొండ ఫిబ్రవరి 4 (స్ఫూర్తి పత్రిక న్యూస్) దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన రైతులు తెలుగుదేశం పార్టీ చేపట్టిన గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా ఆలూరు లో టిడిపి ఇన్చార్జ్ కార్యాలయంలో వైకుంఠం జ్యోతి ని కలిసి వారు ఎదుర్కొంటున్న కరెంటు సమస్యలు వివరించారు. లోవోల్టజీ కారణంగా తరచుగా మోటర్లు కాలిపోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కనుక నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే అందుకు కావలసిన భూమిని ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా రైతులు వివరించారు. స్పందించిన ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి తప్పకుండా మీ సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు కప్పట్రాళ్ల మల్లికార్జున, ఉరుకుంద గౌడ్, ఎర్ర కౌలుట్ల, లాలప్ప, విజయుడు,చింతా మధుసూదన్ ,చింపిరన్న , గొర్ల సుంకన్న, ప్రభాకర్ గౌడ్, ఎల్ల బోయిన సుంకన్న, దేవేంద్రయ్య, మర్యాద రంగన్న, పాపన్న, రవికుమార్ , కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హోలి వేడుకలు

**యువకులకు శుభాకాంక్షలు తెలిపిన లింగాల ఉప సర్పంచ్ వీరాస్వామి**



నాగర్ కర్నూల్ ప్రతినిధి మార్చి 4 (స్ఫూర్తి పత్రిక న్యూస్) లింగాల మండలంలో హోలీ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే యువత, చిన్నారులు గుంపులుగా చేరి రంగులతో సందడి చేశారు. పిల్లలు, పెద్దలు ఒకరిపై ఒకరు రంగులు చల్లి హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొందరు డీజే సంగీతం మధ్య నృత్యాలు చేస్తూ ఆనందం పంచుకున్నారు. లింగాల ఉప సర్పంచ్ వీరాస్వామి యువకులతో కలిసి రంగులు చల్లు లోకి శుభాకాంక్షలు తెలిపారు. వీధులన్నీ రంగుల మయం కావడంతో పండగ వాతావరణం నెలకొంది. స్థానికులు పరస్పరం మిఠాయిలు పంచుకుని సఖ్యతను చాటుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా హోలీ వేడుకలు ప్రశాంతంగా, ఉత్సాహభరితంగా కొనసాగాయి. హోలీ పండగను ఆనందంగా, ఐక్యతతో జరుపుకోవడం ద్వారా ప్రాంత ప్రజలు సాంఘిక సౌహార్దాన్ని ప్రతిబింబించారు.

# మహిళా ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది



నాగర్ కర్నూల్ ప్రతినిధి మార్చి 4 (స్ఫూర్తి పత్రిక న్యూస్)లింగాల మండలం కొత్త చెరువు తండకు చెందిన దాసరి వెంకటమ్మ బుధవారం అకస్మాత్తుగా గృహ కోల్పోయి అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు 108 కి ఫోన్ చేయగా సమాచారం అందుకున్న వెంటనే లింగాల 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. అపస్మాక స్థితిలో ఉన్న వెంకటమ్మను పరిశీలించిన సిబ్బంది. ఆసుపత్రికి తరలించేంత సమయం లేదని గ్రహించి చాకచక్యంగా జీవికే పీఎంఆర్ఐ డాక్టర్లకు సంప్రదించి వారి సహకారంతో అక్కడే చికిత్స ప్రారంభించాడు. వారి సలహాల మేరకు చికిత్స అనంతరం స్పృహ తిరిగి వచ్చింది. మెరుగైన వైద్యం కోసం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు తరలించారు. సమయస్ఫూర్తితో స్పందించి చాకచక్యంగా వ్యవహరించి ప్రాణాపాయం నుంచి తప్పించిన అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి శివశంకర్ పైలెట్ ఖాజా ను కుటుంబ సభ్యులు గ్రామస్తులు అభినందనలు తెలిపారు

SPHOORTI PATRIKA (Telugu Daily) | PRGI Reg. No. APTEL/26/A0542 | Publisher, Printer & Editor: NarasaNaidu Boya | Printed at: Rajeswari Printers, Kurnool |
Place of Publication: Kurnool, Andhra Pradesh | Cell: 8179446036, 7794947413 | Email: sphoortipatrika@gmail.com | Website: www.sphoortipatrika.com